ప్రజాశక్తి
బుధవారం 22 నవంబరు 2023

ఉచితంగా న్యాయ సేవలు

శ్రీకాకుళం లీగల్ : పారాలీగల్ వాలంటీర్లు ఉచితంగా న్యాయ సేవలు అందించాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన ఐదు రోజుల పాటు నిర్వహించే పారాలీగల్ వాలంటీర్ల శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో మంగళవారం ప్రారంభించారు.జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, బార్ అసోసియేషన్ రిసోర్స్‌పర్సన్ అన్నెపు భువనేశ్వరరావు రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, విధులు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, కోటబొమ్మాళి, నరసన్నపేట, పలాస, పాలకొండ, రాజాం, సోంపేట, టెక్కలి, కొత్తూరు, పొందూరు, పలాస, పాతపట్నం కోర్టులకు చెందిన పారాలీగల్ వాలంటీర్లు ప్రత్యక్షంగా, వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

8 నుంచి అంగన్వాడీల నిరవధిక సమ్మె

- గ్రాట్యుటీపై సుప్రీం తీర్పునూ అమలు చేయని ప్రభుత్వం
- వేతన పెంపుపై సిఎం ఇచ్చిన హామీని అమలు చేయాలి
- మినీ వర్కర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలి
- అంగన్వాడీ యూనియన్ నాయకుల డిమాండ్
- ఐసిడిఎస్ పీడీకి సమ్మె నోటీసు అందజేత

సమ్మె నోటీసును అందజేస్తున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వేతన పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబరు ఎనిమిదో తేదీ నుంచి అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ తెలిపారు. ఈ మేరకు సమ్మె నోటీసును ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీకి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు పిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. నిత్యావసర ధరలు పెరుగుతున్నా, వేతనాలు మాత్రం పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. తెలంగాణ కంటే రూ.వెయ్యి ఎక్కువ వేతనం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి హామీ నెర్చవేర్చలేదని విమర్శించారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని గతేడాది సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా, రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. రిటైర్డ్ అయిన సందర్భంలో నామినల్ మొత్తం ఇవ్వడం వల్ల ఒంటరి మహిళలు, కుటుంబ ఆదరణ లేని వాళ్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 48 ఏళ్లుగా పనిచేస్తున్న అంగన్వాడీలు సర్వీసులో చనిపోతే మట్టి ఖర్చులు కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయడం లేదని చెప్పారు. సమస్యలపై అంగన్వాడీలు దశల వారీగా అనేక ఆందోళనలు చేపట్టారని, అధికారులతో చర్చలు జరిగినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. దీంతో డిసెంబరు ఎనిమిదో తేదీ నుంచి సెంటర్లని మూసివేసి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. మినీ సెంటర్లను తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.ఐదు లక్షలకు పెంచాలని, పెన్షన్ ఇవ్వాలని కోరారు. హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలన్నారు. రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. సమ్మె నోటీసు అందజేసిన వారిలో యూనియన్ నాయకులు కె.సుజాత, పి.లతాదేవి, బి.రమణమ్మ, వాగ్దేవి, విజయలక్ష్మి, ప్రమీల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బోల్తా పడిన ట్రాక్టర్ ట్రక్కు

- ఇద్దరు మృతి, 27 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- మందస మీదుగా ఒడిశా వెళ్తున్న వాహనానికి ప్రమాదం
- బిజెపి సభకు హాజరయ్యేందుకు వెళ్తున్న బాధితులు

ట్రాక్టర్ బోల్తా

మృతి చెందిన జగన్నాథ్

దేరా మృతదేహం

ప్రజాశక్తి - మందస, పలాస

మందస మండలం గౌడు గురంటి సమీపం వద్ద మంగళవారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కుసుమాలకు చెందిన గిరిజనులు బుయ జగన్నాథ్ (50), అబుతొడికి చెందిన సవర దేరా (60) అక్కడికక్కడే మృతి చెందారు. 27 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఒడిశా, ఆంధ్రా పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు, క్షతగాత్రులు తెలిపిన వివరాల మేరకు ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా చీకటికోటలో నిర్వహించే బిజెపి బహిరంగ సభకు అదే జిల్లా గుడ్డిభద్రకు చెందిన బిజెపి నాయకుడు సవర కుడుము... కుసుమాల, డబాతోలి, గుడ్డిపొదర్, పత్రసాయి, వంబాడియా గిరిజన గ్రామాలకు చెందిన సుమారు 30 మంది మహిళలు, పురుషులను ట్రాక్టర్‌లో తీసుకెళ్లాడు. మందస మండలం మీదుగా చీకటికోటకు వెళ్లాల్సి ఉండగా, గౌడు గురంటి గెడ్డ సమీపానికి వచ్చేసరికి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో సవర దేరా, బుయ జగన్నాథ్ అక్కడికక్కడే మతి చెందారు. 27 మందికి గాయాలయ్యాయి. ఘటనా సమాచారం తెలుసుకున్న మందస పోలీసులు, రెవెన్యూ అధికారులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. క్షతగాత్రులను 108లో మందస మండలం హరిపురం సిహెచ్‌సికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.

మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

కుటుంబసభ్యుల కన్నీరుమున్నీరు

ప్రమాద సమాచారం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో తాము ఎలా బతికేదంటూ రోదిస్తున్నారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న ఒడిశా రాష్ట్రం జరడా పోలీస్‌స్టేషన్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ సాసుమాను హరిపురం సిహెచ్‌సికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను క్షతగాత్రులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు మందస ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి నవీన్

ఓటు హక్కు ప్రాముఖ్యత తెలుసుకోవాలి

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రతిఒక్కరూ ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు ప్రాముఖ్యతపై నిర్వహించిన బైక్ ర్యాలీని నగరంలోని పురుషుల ప్రభుత్వ కళాశాల వద్ద మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. జిల్లా జనాభాలో 18 ఏళ్లు నిండిన యువత 46 వేల మంది ఉండగా, వారిలో 18 వేల మంది మాత్రమే ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. మిగిలిన వారినీ ఓటర్లుగా చేరాలన్నదే స్వీప్ కార్యక్రమం లక్ష్యమన్నారు. డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు ఓటరు నమోదు ప్రక్రియ సాగుతుందని, ఆన్‌లైన్ ద్వారా చేసుకోవచ్చని చెప్పారు. జిల్లాలో 2,500 మంది అధికారులు 24 లక్షల మంది ఓటర్ల జాబితా తయారీలో ఎంతో శ్రమకోర్చి పనిచేస్తున్నారని చెప్పారు. ఓటుహక్కు వినియోగించని వారికి అవగాహన కల్పించడం చాలా అవసరమన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో యువత ప్రధాన పాత్ర పోషించాలన్నారు, ఓటు హక్కు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని, ఇందుకు సంబంధించిన విధివిధానాలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, తహశీల్దార్ కె.వెంకటరావు, సచివాలయ సిబ్బంది, పలు కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అయ్యప్ప యాత్రికులు శబరిమలను దర్శించుకునేందుకు శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస), విశాఖపట్నం నుంచి వేర్వేరుగా రెండు ప్రత్యేక రైళ్లను ప్రారంభించనున్నట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. శబరిమలకు ప్రత్యేక రైలును ప్రారంభించాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు చేసిన డిమాండ్‌కు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జిఎం ఆమోదం తెలిపారు. ఇప్పటివరకు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ డివిజన్ నుంచి మాత్రమే ఏటా సీజన్ కొల్లాంకు ప్రత్యేక రైళ్లు నడుస్తున్నాయి. ఉత్తరాంధ్ర నుంచి తొలిసారిగా శబరిమలైకు ప్రత్యేక రైళ్లు మంజూరయ్యాయి. వీటి కేటాయింపుపై హర్షం వ్యక్తం చేసిన ఎంపీ రామ్మోహన్ నాయుడు... జిఎం, వాల్తేరు డిఆర్ఎంతో ఫోన్‌లో మాట్లాడారు. తమ ప్రాంతవాసుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఆమోదించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలియజేశారు.

రైళ్ల సమయాలు ఇవే...

శ్రీకాకుళం రోడ్డు-కొల్లాం స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (08537 / 08538) నవంబర్ 25 నుంచి జనవరి 27 వరకు ప్రతి శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, సింహాచలం, దువ్వాడ(బైపాస్) మీదుగా ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు గమ్యస్థానం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాంలో ఆదివారం రాత్రి 7.35 గంటలకు బయలుదేరి, సోమవారం రాత్రి రెండు గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుకుంటుంది. ఇందులో రిజిస్ట్రేషన్, జనరల్ బోగీలు సహా 22 కోచ్‌లు ఉంటాయి.

విశాఖపట్నం-కొల్లాం వీక్లీ స్పెషల్ రైలు (08539 / 08540) నవంబర్ 29 నుంచి జనవరి 31వ తేదీ వరకు ప్రతి బుధవారం ఉదయం 8.20 గంటలకు ప్రారంభం కానుంది. దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి మీదుగా ప్రయాణించి, గురువారం మధ్యాహ్నం 12.55 గంటలకు గమ్యానికి చేరుకుంటుంది. కొల్లాంలో ప్రతి గురువారం రాత్రి 7.35 గంటలకు బయలుదేరి, శుక్రవారం రాత్రి 11.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మత్స్యకారుల ఆర్థిక, జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4,486 కోట్లు ఖర్చు చేసిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవ రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని అమరావతి నుంచి సిఎం జగన్ మంగళవారం ప్రారంభించగా, కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ విశాఖ హార్బర్‌లో అగ్ని ప్రమాదంలో 33 బోట్లు కాలిపోయిన సంఘటనలో మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి వెంటనే స్పందించి 80 శాతం నష్టపరిహారాన్ని చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. మత్స్యకార భరోసా సాయం కింద రూ.10 వేలు, డీజిల్ సబ్సిడీ లీటర్‌కు రూ.9, వేట చేస్తూ మరణిస్తే రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదన్నారు. మూలపేట పోర్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంతో జిల్లాలోని మత్స్యకారులకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు.

ఆక్వా ల్యాబ్ ప్రారంభం

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రూ.35 లక్షల విలువ చేసే మొబైల్ ఆక్వా ల్యాబ్ రూ.14 లక్షల రాయితీతో, రూ.13.29 లక్షల విలువ చేసే చేపల సీడ్ రవాణా వాహనం రూ.8 లక్షల రాయితీతో, రూ.10 లక్షల విలువ చేసే ఫిష్ కియోస్క్ రూ.4 లక్షల రాయితీతో లబ్ధిదారులకు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పంపిణీ చేశారు. మత్స్యకార భరోసా సహాయం కింద జిల్లాలో ఈ ఏడాది 15,281 మందికి రూ.పది వేలు చొప్పున రూ.1528.1 లక్షల సహాయాన్ని వారి ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జెడి పి.వి శ్రీనివాసరావు, డిసిసిబి సిఇఒ వరప్రసాద్, మత్స్యకార సంఘ నాయకులు కోన నర్సింగరావు, ఆప్కాబ్ డైరెక్టర్ బర్రి తోటమ్మ, మైలపల్లి పోలీసు, వైస్ ఎంపిపి వంక రాజు, సొసైటీ అధ్యక్షులు సూరాడ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వాహన తాళాన్ని అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

4న చలో ఢిల్లీ

వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాట్లాడుతున్న వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

దళిత హక్కులు, సామాజిక, ఆర్థిక, భూ సమస్యలు తదితర 21 డిమాండ్లను నెరవేర్చాలని డిసెంబరు నాలుగో తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కోటి సంతకాలతో విజ్ఞాపన పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. నగరంలోని ఆ సంఘ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నేటికీ దళితులపై దాడులు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మణిపూర్‌లో మనువాదుల చేతుల్లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేయడం యావత్ భారతదేశాన్ని తలదించుకునేలా చేసిందని చెప్పారు. ఇంత జరిగినా ప్రధాని నరేంద్ర మోడీ పల్లెత్తు మాట మాట్లాడకపోవడం, దాడులు చేసిన వారికి రక్షణ కల్పించడం సిగ్గుచేటు అన్నారు. బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్‌ప్లాన్ చట్టాన్ని రద్దు చేసిందని విమర్శించారు. రిజర్వేషన్లను అమలు చేయకుండా అనేక ప్రయత్నాలు చేస్తోందన్నారు. మనువాద భావజాలాన్ని అమలు చేసి లౌకిక రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతోందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా దళితులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రోహిత్ మాథూర్

26 నుంచి వికసిత భారత్ సంకల్పయాత్ర

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విధానాలకు సంబంధించి పౌరులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈనెల 26 నుంచి జిల్లాలో వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి రోహిత్ మాథూర్ తెలిపారు. ఈనెల 26 నుంచి జనవరి ఒకటో తేదీ వరకు సంకల్పయాత్ర ఉంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులపై కలెక్టరేట్‌లోని సమావేశ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు పథకాల కింద అర్హులైనా, ఇప్పటివరకు ప్రయోజనం పొందని బలహీనవర్గాలను చేరుకోవడం అవసరమన్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ 17 సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందుతున్న అంశంలో గణాంకాలను సవివరంగా అడిగి తెలుసుకున్నారు. పథకాల విస్తృత ప్రచారం కోసం ఏమేం చేయొచ్చని అధికారుల సూచనలు, సలహాలను కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు లబ్ధి చేకూరేలా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో వికసిత భారత్ సంకల్పయాత్ర జిల్లా నోడల్ అధికారి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిపిఒ వి.రవికుమార్, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు డి.వి విద్యాసాగర్, జి.వి చిట్టిరాజు, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి వాసుదేవరావు, ఇతర జిల్లాస్థాయి అధికారులు, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

సాధనతోనే సత్ఫలితాలు

ప్రజాశక్తి - గార

సాధనతోనే సత్ఫలితాలు వస్తాయని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పోర్టు కళింగపట్నం శ్రీ బుద్ధా స్కూల్, జిల్లా పాఠశాల క్రీడా సంఘం సంయుక్తంగా నిర్వహించిన 76వ అంతర పాఠశాలల జోనల్ గ్రిగ్స్ పోటీలను కళింగపట్నంలో మంగళవారం ప్రారంభించారు. ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించే ఈ పోటీల్లో శ్రీకాకుళం, నరసన్నపేట నియోజవర్గాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని, శారీరక దృఢత్వంతో పాటు మనో వికాసానికి దోహదపడతాయని చెప్పారు. గ్రామీణ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తి ముఖ్యమన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

తాత్కాలిక ఆటో స్టాండ్ ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆర్‌టిసి కాంప్లెక్స్ డిపోకు ఆనుకొని ఆటోలు నిలిపేందుకు వీలుగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా తాత్కాలిక ఆటో స్టాండ్‌గా ఐరన్ గ్రిల్స్‌ను ఏర్పాటు చేసినట్లు ట్రాఫిక్ డిఎస్‌పి సిహెచ్.జి.వి ప్రసాదరావు తెలిపారు. తాత్కాలిక ఆటో స్టాండ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు వైండింగ్, కాలువ మరమ్మతులు నేపథ్యంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ప్రజా రవాణా, వాహనాల రాకపోకలు రద్దీగా ఉండడంతో ఆటోలు నిలుపుటకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని ఆటో యూనియన్ సభ్యులకు సూచించినట్లు తెలిపారు.

ఈ మేరకు వారు ఐరన్ గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారని, వీటిపై ఒకేసారి 8 నుంచి 10 ఆటోలు వరకు నిలుపుకోవచ్చునని చెప్పారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బలగ వైపు వెళ్లే రహదారిపై ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవన్నారు. రోడ్డు మరమ్మతులు పూర్తయ్యే వరకు ఆటోలను నిలుపుకొని పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ఆటో యూనియన్ సభ్యులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ దొర, ఆటో యూనియన్ సభ్యులు జి.రామ్మోహన్ నాయుడు, తమ్మినేని మధుసూదన్, శ్రీను, డ్రైవర్లు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM. OS. 425/2021.

Between:
Yenni Srinivasa rao --Plaintiff.
And:
Pedada Dharma Rao --Defendant.

To,
Pedada Dharma Rao, S/o late Venu Gopala rao, Hindu, Aged about 45 Years Door No 1- 146, C/o Pydi Lokanadham, Main street, Peddaveedhi, Kinthali Village and Post, Ponduru Mandalam, Srikakulam District.

NOTICE

Please take this notice that the above matter is posted to **04-12-2023** for your appearance. You are hereby directed to appear before the Hon'ble court **at 10-30 A.M** either in person or through an Advocate without fail and file your objections if any, otherwise the matter will be decided in your absence.

**\\ By court order **

DUMPALA RAMANA RAO
Advocate, Srikakulam,
Cell: 9949291368.

27న సామాజిక సాధికార యాత్ర

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - రణస్థలం

సామాజిక సాధికార బస్సు యాత్రను ఈనెల 27న ఎచ్చెర్ల మండలంలోని చిలకపాలెంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌తో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాత్రలో భాగంగా 27న రణస్థలం మండలం పైడిభీమవరంలోని మహి గ్రాండ్‌లో పలువురు మంత్రులు విలేకరుల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఎచ్చెర్ల నియోజకవర్గంలోని విశ్రాంత ఉద్యోగులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. కొండములగాం మోడల్ స్కూల్ సందర్శన అనంతరం రణస్థలం నుంచి బైక్ ర్యాలీగా వెళ్లి లావేరు మండలం బుడుమూరు గ్రామ సచివాలయాన్ని సందర్శిస్తారని తెలిపారు. అక్కడ్నుంచి ఎచ్చెర్ల మండలం చిలకపాలెం కూడలికి చేరుకుని అక్కడ బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి ఎల్.ప్రసాద్, జి.సిగడాం ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, రణస్థలం, జి.సిగడాం జెడ్‌పిటిసిలు టి.సీతారాం, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణదాస్

పొలాన్ని పంటను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి- మందస

జిల్లాను కరువు జిల్లాగా ప్రభుత్వం ప్రకటించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, కోనారి మోహనరావు, ఎపి జిల్లా రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని కొండలోగామ్, తపగాం, పట్లోగం, కొయ్యాడుబీధి, రాయికోల గిరిజన గ్రామాల్లో ఎండిన వరి పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజన్ ప్రారంభం నుంచి అప్పు చేసి అన్ని రకాల పెట్టుబడులు పెట్టి ఆరుగాలం శ్రమించి పంట చేతికి అందక వరి ఎండిపోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గిరిజన రైతులు సవర రామారావు, సవర గణపతి, సవర నరసింహులు, గేదెల దుర్యోధన పాల్గొన్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం

ప్రజాశక్తి- పలాస

18 ఏళ్ళు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ అన్నారు. ఓటరుగా నమోదు, ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు చైతన్య పరుస్తూ... విద్యావాహిని జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులచే ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డిసి కాంప్లెక్స్ వద్ద ప్రారంభమైన ర్యాలీ కాశీబుగ్గ పాతబస్టాండ్ వద్ద వరకు సాగి అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని అన్నారు. తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు మాట్లాడుతూ ఓటరుగా నమోదు చేసుకోవడమే కాకుండా తెలిసిన వాళ్లకు ఓటరుగా నమోదు చేయించాలని అన్నారు. కార్యక్రమంలో విద్యావాహిని కళాశాల కరస్పాండెంట్ పైల తిరుమలరావు, రెవెన్యూ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక రెవెన్యూ అధికారులు కోట కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయంలో ఓటు హక్కు నమోదుపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ గురుప్రసాద్, డిటి శ్రీహరి, సంతోష్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : తహశీల్దార్ కార్యాలయం నుంచి కృష్ణాపురం కూడలి వరకు అధికారులు ఓటు నమోదుపై బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.గణపతి, ఎన్నికల డిటి మురళీధర్ నాయక్, ఆర్ సర్వే డిటి బాడాన శ్రీనివాసరావు, మండల సర్వే బోడ్డేపల్లి గోవిందరావు, అసిస్టెంట్ స్టాటిక్స్ ఆఫీసర్ బి.గోవిందరావు పాల్గొన్నారు.

పోలాకి : తహశీల్దార్ కార్యాలయం నుంచి ఎండిఓ కార్యాలయం వరకు ఓటర్ల నమోదు అవగాహన బైక్ ర్యాలీని అధికారులు నిర్వహించారు. ఎన్నికల డిటి శ్రీనివాసరావు, డిటి కోటేశ్వరరావు, ఆర్‌ఐ సతీష్, సూపరింటెండెంట్ సూర్యప్రకాశరావు, ఇఒపిఆర్‌డి పద్మావతి పాల్గొన్నారు.

పలాస : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

కవిటి: స్థానిక ఎస్ఐజె, బడగల శంకరరావు డిగ్రీ కళాశాల విద్యార్థులతో కవిటిలో ఓటు నమోదు అవగాహనా బైక్ ర్యాలీని నిర్వహించారు. తహశీల్దార్ పి.శేఖర్, ఆర్‌ఐ రమణమూర్తి, విఆర్‌ఒలు దామోదర్, ప్రశాంతి, నారాయణ, ఎస్ఐజె, బి.ఎన్.ఆర్ ప్రిన్సిపాల్ ఎ.భాస్కరరావు, పి.కృష్ణారావు, సిబ్బంది ఆర్.మహేష్, ఎ.జగన్నాథమయ్యలు, వజ్జ జయప్రకాష్, జల్లు సుబ్బారావు, ముకుందరావు, జె.భీమారావు, సాయి పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

మీనరాజు మృతదేహం

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని భవానీపురానికి చెందిన తిప్పన మీనరాజ్ (20) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మీనరాజు కొంతకాలంగా చెడు వ్యసనాలకు బానిసై ఇంట్లో వారితో నిరంతరం ఘర్షణ పడేవాడు. సోమవారం రాత్రి బైక్ కొంటానని, డబ్బులు ఇవ్వాలని కోరారు. డబ్బులు లేవని తల్లి సమాధానం చెప్పడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం రైలుకు ఎదురుగా నిల్చొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైలు ఢీకొన్న అనంతరం మృతదేహం తుళ్ళి చిదంబరేశ్వర ఆలయం పక్కన పడింది. తీవ్రంగా గాయపడటంతో ప్రమాదస్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టౌన్ ఎస్ఐ ఐ.గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు మృతి

రణస్థలం రూరల్: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న నల్లి రాజేష్ (24) మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లావేరు మండలం బుడుమూరుకి చెందిన రాజేష్, వంగర మండలం రిమ్మానికి చెందిన గొర్లె అనూషని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. వీరికి 11 నెలల కుమారుడు ఉన్నాడు. రాజేష్ మండల కేంద్రంలో వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. 9 నెలలు నుంచి యాతిరిలో నివాసం ఉంటున్నాడు. అయితే ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఈ నెల 10న పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. దీనిని గమనించిన భార్య జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాళ్లవలసలో...

లావేరు : కుటుంబ కలహాలు, చిన్నపాటి క్షణికావేశానికి ఓ నిండు ప్రాణం బలైపోయింది. లావేరు మండలం తాళ్లవలసకు చెందిన కూనపల్లి గౌరీశంకర్ (34) ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపి వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 17న గౌరీశంకర్ మద్యం తాగి ఇంటికి రావడంతో భార్యాభర్తలు గొడవ పడ్డారు. భార్య ఎన్ని రోజులు ఇలా భరిస్తామని చెప్పి ఇంటిలో ఉన్న ఫినాయిల్ ఒంటిపై పోసుకుంది. ఇది చూసిన భర్త గౌరీశంకర్ నువ్వు ఎందుకు చనిపోతావు... నేనే చనిపోతానంటూ ఇంట్లోని ఫ్యానుకు ఉరిపోసుకున్నాడు. ఇదీ గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాగోలు జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఐదు రోజులు చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతునికి భార్య శారద, ఇద్దరు చిన్నపిల్లలు యశ్వంత్, అశ్విని ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయామని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గౌరీశంకర్ (ఫైల్)

మాట్లాడుతున్న సర్పంచ్ ఢిల్లీరావు

రైతు ద్రోహులు అచ్చెన్న, శివాజీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వంశధార శివారు భూములకు సాగునీరు అందకుండా అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు, శివాజీలే ద్రోహం చేశారని పెద్దబొడ్డపాడు సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు అన్నారు. మండలంలోని సీతాపురంలో వైసిపి నాయకులతో కలసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వంశధార శివారు భూములకు సాగునీరు అందడం లేదని ఇప్పుడు గొంతు చించుకొని మత్స్యపెడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు, గౌతు శిరీషలు అప్పుడు మీ హయంలో నిర్మించిన అనధికార లిఫ్టులపైనా మాట్లాడితే బాగుండేది అన్నారు. మీకు నిజంగా రైతులపై ప్రేమ ఉంటే అనధికార లిఫ్టులపై అచ్చెన్నాయుడు, శివాజీలను నిలదీయాలన్నారు. లిఫ్టుల కమిటీ సృష్టిపై మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యేగా ఉన్న శివాజీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి అప్పలరాజు కృషి మేరకు ఆఫ్‌షోర్‌కు నిధులు తీసుకొస్తున్నారని, పెద్ద బొడ్డపాడు, సీతాపురంలో టిడిపిలో చేరికలు కాదని, టిడిపి రిన్యూవల్స్ అని ఎద్దేవా చేశారు. ఎంపిటిసి మాజీ సభ్యులు తమ్మినేని అప్పారావు, ఉప సర్పంచ్ దుంపల గోవింద, బూత్ కమిటీ కన్వీనర్ యర్ర రాజారావు, గ్రామ కమిటీ అధ్యక్షులు హనుమంతు అప్పలస్వామి పాల్గొన్నారు.

విశాఖ హార్బర్ బాధితులను ఆదుకోవాలి

పలాస : విశాఖ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎంతో మంది బోట్లు అగ్నికి ఆహుతయ్యాయని, బాధిత మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకార ఐక్యవేదిక నాయకులు అంబటి ఆనందరావు కోరారు. మత్స్యకారులకు జరిగిన నష్టానికి చింతిస్తూ మంగళవారం నిర్వహించాల్సిన ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని వాయిదా వేస్తూ... బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. వొక్కర నరహరి తామాడ తులసి, బొక్కర ఈశ్వరరావు, రామారావు, భీమారావు, లండ రమణ, వంక ఢిల్లీ, పల్లేటి గణపతి, నాగేశ్వరరావు, బి.సింహాచలం, కృష్ణ, రామ్ పాల్గొన్నారు.

రైతుల కష్టాలు కనిపించవా? ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించవా? అని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. మంగళవారం పెద్దబొడ్డపాడు, సీతాపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మణిగాం తాతయ్య, దుంపల వల్లభ, టి.గోపాలరావు ఆధ్వర్యంలో ఉప్పాడ కృష్ణారావు, మాజీ సర్పంచ్ పంది రామారావు, గొల్లపల్లి ధర్మారావు, తమ్మినాన కృష్ణారావు, దుంపల తిరుపతిరావు, తమ్మినాన నరసింహమూర్తి తదితర 60 కుటుంబాలు ఎంపీ రామ్మోహన్, గౌతు శిరీష సమక్షంలో టిడిపిలోకి చేరారు. వీరికి పార్టీ కండువ వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు నీరు అందించలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. ఈ ఏడాది వరి పంటలకు నీరు అందించకపోవడంతో ఎండిపోయాయని అన్నారు. ప్రతిపోటా సెల్ఫీలు దిగుతూ బిఫోర్ అప్పలరాజు ఆఫ్టర్ అప్పలరాజు అంటూ పోజులిస్తున్నారని అన్నారు. నిజమే అప్పలరాజుకు ముందు కొండలు, ప్రకృతి సంపద ఉండేదని, అప్పలరాజు వచ్చాక కొండలు మాయం అయ్యాయని ఎద్దేవా చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత అడ్డగోలుగా దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. శిరీష మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత బెండిగెడ్డలో లిఫ్ట్ ఇరిగేషన్ తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని రైతుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దువ్వాడ హేమబాబు చౌదరి, సూరాడ మోహనరావు, జి.వసంతస్వామి, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, దువ్వాడ జయరాం చౌదరి, కణితి సురేష్, కోనారి కిరణ్ కుమార్, శశిభూషణ్, సాంబమూర్తి పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

అబలకు అండగా...

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

ఆపద వచ్చినప్పుడు ఆదుకునేందుకు ఆపన్నహస్తాలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయని మరోమారు రుజువైంది. ఓ రోడ్డు ప్రమాదంలో కొడుకు ప్రాణాలు కోల్పోతే, కాలికి తగిలిన దెబ్బ పుండుగా మారి ఏకంగా భర్త కాలునే తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల్లో అటు మంచంపై ఉన్న అత్త, ఇటు నడవలేని భర్తకు సేవలు చేస్తూ దయనీయ స్థితిలో ఉన్న వరక గ్రామానికి చెందిన ఎన్ని సుజాత పరిస్థితిపై 'కష్టాలసుడిలో కార్మిక దాసి' అంటూ ఈ నెల 20న 'ప్రజాశక్తి' కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన దాతలు సుజాత బ్యాంకు ఎకౌంటుకు, ఫోన్ పే నంబరుకు తమకు తోచిన ఆర్థికసాయం అందిస్తున్నారు. దీంతో మొదటి రోజే రూ.28 వేలు అందినట్లు సుజాత ప్రజాశక్తికి తెలిపింది. అంతేకాకుండా పలువురు దాతలు ఫోన్ ద్వారా తమ పరిస్థితి తెలుసుకుని సాయం చేయడానికి ముందుకు వస్తున్నారని, కొన్ని స్వచ్ఛంద సంస్థలు తమ కోసం నగదు సేకరిస్తున్నట్లు చెప్పారని తెలిపారు. ఓవైపు ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి, మరోవైపు ఆ రోజు ఎలా గడుస్తుందో అన్న ఆలోచనలో ఉన్న తనకు ప్రజాశక్తి సహకారంతో దాతల అండ లభిస్తోందని ఆమె తెలిపింది.

24న దళిత శంఖారావం

సరుబుజ్జిలి : రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 24న శ్రీకాకుళంలోని జిల్లా టిడిపి కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ దళిత శ్రేణులు చేపట్టనున్న దళిత శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమదాలవలస నియోజకవర్గ టిడిపి ఎస్‌సి సెల్ కన్వీనర్ గుర్రాల చినబాబు పిలుపునిచ్చారు. సరుబుజ్జిలిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ రోజు ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి రాష్ట్ర టిడిపి నాయకులతో పాటు జిల్లాలోని పలు విభాగాలకు చెందిన నాయకులు పాల్గొంటారని అన్నారు. ఈయన వెంట దళిత నాయకులు తోట రాము, ఎస్.రాజారావు, బి.అప్పయ్య, జి.రాజారావు ఉన్నారు.

మాట్లాడుతున్న పరమేశ్వరరావు

ఆందోళనకు సిద్ధం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎచ్చెర్లలో కొవ్వాడ మత్స్యలేశం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, తోటపల్లి కాలువల మరమ్మతులు, పూడిక తీత పనులు చేపట్టాలని డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు డిమాండ్ చేశారు. రణస్థలంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కొత్తకోట సింహాద్రినాయుడు అధ్యక్షతన మంగళవారం కో-ఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా సమస్యల పరిష్కారానికి ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిస్తూ... ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శులు సనపల అన్నాజీరావు, పైడి నాగభూషణరావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, దళిత విభాగం అధ్యక్షులు తెంబూరు మధుసూదనరావు, కిసాన్ సెల్ కాంగ్రెస్ అధ్యక్షులు డి.గోవింద మల్లిబాబు, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు దన్నాన బోగినాయుడు, గార మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి దాలినాయుడు, ఎచ్చెర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.లక్ష్మి, కె.జోగినాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రెడ్డి శాంతి

ఫిష్ ఆంధ్రా ప్రారంభం

ప్రజాశక్తి- కొత్తూరు

నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఫిష్ ఆంధ్రాను సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక గోగుల రామారావు నాయుడు కాంప్లెక్స్‌లో యూనియన్ బ్యాంకు సహకారంతో పిన్నింటి లక్ష్మి కొండ పేరుతో మంజూరైన ఫిష్ ఆంధ్రాను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిష్ ఆంధ్రాతో మత్స్యకారుల తలసరి ఆదాయం పెంచుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పడల కృష్ణవేణి, కుంచాల రత్నాలు, పెడకోట సాధుబాబు, నాసా బాలకృష్ణ, పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, మత్స్యకార రాష్ట్ర డైరెక్టర్ పి.మురళీకృష్ణ, ఎఫ్‌డిఒ గోపీకృష్ణ, డిపిఎం షణ్ముఖరావు, బ్యాంకు మేనేజర్ రాజశేఖర్, తహశీల్దార్ ఎం.చక్రవర్తి, వైసిపి నాయకులు గోగుల వరప్రసాదరావు నాయుడు, జి.ఆనందరావు, ఎల్.తిరుపతిరావు, బి.శ్రీను, ప్రదీప్‌కుమార్, రాజులనాయుడు, జి.బాలచంద్రుడు, జె.రామకృష్ణ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

మత్స్యకారులది ప్రత్యేక సంస్కృతి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మత్స్యకారులది ప్రత్యేక సంస్కృతి అని దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మలగాం పంచాయతీ సూరాడవానిపేటలో మత్స్యకార సామాజిక సంస్కృతి సమితి జిల్లా అధ్యక్షుడు సూరాడ జోగారావు అధ్యక్షతన మంగళవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడుతూ మైదాన ప్రాంతంలో బతకడం ఒకెత్తైతే... సముద్రంపై ఆధారపడి జీవించడం అతి కష్టమని అన్నారు. ఇప్పటికీ మత్స్యకారుల జీవన పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల సమస్యలను సిఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పోలాకి జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి సిఎం జగన్ దృష్టిసారించారని అన్నారు. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బోటు యజమానులకు సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి సీదిరి అప్పలరాజును పంపించి బాధితులకు అండగా నిలవాలని ఆదేశించారని అన్నారు. అనంతరం కొర్రాయి చెందిన సుదిష్ట చేసిన జానపద నృత్యం, శాస్త్రీయ నృత్యం, టెక్కలికి చెందిన శాంతా బాయి బృందం వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అంతకుముందు గ్రామంలో పెద్ద ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపి మేరుగు రాజేశ్వరి, సంతబొమ్మాళి మత్స్యకార సంఘం అధ్యక్షులు సూరాడ వెంకటేష్, మత్స్యకార సంఘం నాయకులు లండ రుద్రమూర్తి, జోగి రాములమ్మ, గోపినాథ్ బెహరా, లండ చైతన్య, సూరాడ రాజారావు, మేడపల్లి శ్రీనివాసరావు, వంక చిరంజీవి, బల్లె రాజు, రట్టి పెరుమాళ్, అంగ అప్పారావు, బి.సుధాకర్ పాల్గొన్నారు.

కవిటి: మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు జెడ్‌పి వైస్‌చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. మండలంలోని ఇద్దివానిపాలెంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఇటీవల చెన్నయ్‌లో మృతి చెందిన వలస మత్స్యకారులు బి.ఢిల్లేశు, జి.జనార్దన్ కుటుంబ సభ్యులకు చింతామణి సి ఫుడ్స్ అసోసియేషన్ తరుపున చెరో రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, మత్స్యకార సంఘం ప్రతినిధులు కాయ భీమ సేన్, బి.రామారావు, ఎం.సోమయ్య, బి.మాధవరావు, బి.మోహనరావు, జి.రమేష్, కె.వందయ్య పాల్గొన్నారు.

పద్మనాభంలో...

నరసన్నపేట: ఆహార ఉత్పత్తిలో ఆక్వా రంగం అత్యంత ప్రాధాన్యత కలిగిందని, చేపల ఉత్పత్తిలో భారత్ ప్రస్తుతం మూడో స్థానంలో కొనసాగుతోందని మత్స్య శాఖ విశ్రాంత నిపుణులు డాక్టర్ వెలమల గోవిందరావు అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సి.హెచ్.దుర్గాప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు కాదు రహదారే

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సరుబుజ్జిలి ప్రధాన రహదారిపై నీరు చేరి వాహనదారులను ప్రజలను పలు ఇబ్బందులకు గురిచేస్తుంది. ఈ దృశ్యాన్ని చూపెడుతూ పలువురు ఇది చెరువు కాదని రహదారేనని చెబుతుండడం విశేషం. వంశధార కుడి కాలువ విడిచి పెట్టినప్పుడు దాని దిగువనే ఉన్న పంట పొలాల మీదుగా వస్తున్న నీరు కల్వర్టుకు వెళ్లి. అది మూసుకుపోవడంతో సరుబుజ్జిలి ప్రధాన రహదారిపైకి నీరు చేరు చేరుతుంది. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిని నివారించాల్సిన పలు శాఖల అధికారులు చోద్యం చూస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ప్రధాన రహదారిపైకి నీరు చేరడం వల్ల రహదారులు పాడైపోతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రధాన రహదారిపై నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని ప్రజల ముక్తకంఠంతో కోరుతున్నారు.

ప్రధాన రహదారి పైకి చేరిన నీరు

సేవలకు గుర్తింపు

శ్రీకాకుళం : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల జిల్లా కేంద్ర గ్రంథాలయం, జిల్లాలోని అన్ని శాఖాగ్రంథాలయాల్లో విజయవంతంగా నిర్వహించేందుకు సెక్రటరీ బుర్రి కుమార్ రాజు కృషి చేశారని డైరెక్టర్ సువ్వారి సువర్ణ అన్నారు. ఆ మేరకు జిల్లా గ్రంథాలయంలో కుమార్‌రాజుకు దుశ్శాలువ కప్పి సన్మానించి మెమెంటో అందజేశారు. జిల్లాలో వారోత్సవాలను విజయవంతానికి సహకరించిన పాఠకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నౌపడ : నౌపడ శాఖగ్రంథాలయాధికారి బి.రూపావతికి జిల్లా పురస్కారం అవార్డు లభించింది. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సువ్వారి సువర్ణ, కార్యదర్శి బుర్ర కుమార్ రాజుల చేతుల మీదుగా మంగళవారం అవార్డును అందుకున్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించడంపై రూపావతికి ఈ పురస్కారం లభించింది. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కళ్ల రాజు, రమణమూర్తి, డిప్యూటీ లైబ్రరీ వి.శంకర్ తదితరులు అభినందించారు.

నౌపడ : సన్మానిస్తున్న సువర్ణ

రోడ్డును పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

రూ.5 కోట్లతో మున్సిపాల్టీ సుందరీకరణ

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని రూ.5 కోట్ల నిధులతో సుందరీకరణ చేస్తున్నామని, త్వరలో పనులు పూర్తవుతాయని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. కెటి రోడ్డు రహదారి పనులను ఎఇ అవినాష్‌తో కలిసి మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 14,15 ఆర్థిక సంఘం ప్రజాశిక నిధులతో పాటు, సాధారణ నిధుల రూ.5 కోట్లతో రెండు వైపులా 149 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. గతంలో 66 అడుగుల ఉన్న కెటి రోడ్డును 80 అడుగుల పెంచుతూ డబుల్ లేయర్‌తో ఇందిరా చౌక్ నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వరకు కాలువలు, తారు రోడ్డు బెర్మన్ కలుపుతూ నిర్మిస్తున్నామని తెలిపారు. ముత్యాలమ్మ కోనేరు (స్విమ్మింగ్‌పూల్)ను రూ.పది లక్షలతో ఆధునీకరణ చేస్తున్నామని, కోనేరులో ఉన్న చెత్తాచెదారం, పూడికలను తొలగిస్తున్నామని తెలిపారు. ముత్యాలమ్మ కోనేరు సంబంధిత భూముల ఆక్రమణ కాకుండా చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేస్తామని తెలిపారు.

'ఉపాధి'తో వలసల నివారణ

ప్రజాశక్తి- కవిటి

వలసల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్నట్లు కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు. కవిటి సచివాలయం-1లో ఉపాధి హామీ పథకంపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరమైన ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పని కల్పిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 2023-24కి గాను రూ.3 కోట్ల అంచనాతో 37 పనులు మంజూరు కోసం ప్రణాళికలు పంపించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి పూడి నీలాచలం, నాయకులు బెందాళం వెంకటేశ్వరరావు, బర్ల నాగభూషణరావు, బెందాళం రమణమూర్తి, దేవాద దుర్యోధన, పిన్నింటి జయరాం, ఇఒ వీరభద్రస్వామి, ఎపిఒ భాస్కరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మణరావు

సంక్షిప్త వార్తలు

బిజెపివి ప్రజా వ్యతిరేక విధానాలు

ఆమదాలవలస : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అన్నారు. మండలంలోని కొర్లకోట తన స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రైతులకు, కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూల విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్నదని మండిపడ్డారు. ఒలిపెద్ద పోకడలను అనుసరిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపడమే మార్గమని అన్నారు. విద్యుత్ ప్రయివేటు బిల్లులను వెనక్కి తీసుకుంటామని చేసిన వాగ్దానాలను నేటికీ నెరవేర్చలేదని అన్నారు. ప్రజల ఆస్తులైన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ఓడరేవులు, రైల్వే విద్యుత్ విమానాశ్రయాలు ఎల్ఐసి జాతీయ రహదారులను కేంద్ర ప్రభుత్వం అప్పులతో ఆర్థిక సంక్షోభంలో ఉన్నామని నెపంతో అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెట్టాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అన్నాజీరావు

ఇంటింటికీ తాగునీరు

టెక్కలి : మండలంలోని బొప్పాయిపురం పంచాయతీ పరిధి నీలాపురంలో జలజీవన్ మిషన్ ఆధ్వర్యాన కుళాయి తాగునీటి పథక పనులకు సర్పంచ్ గుజ్జ మోహన్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.2.75 లక్షలు

టెక్కలి రూరల్: మండలంలో రావివలసలో ఉన్న ఎండల మల్లిఖార్జునస్వామి కార్తీకమాసం మొదటి సోమవారం హుండీ ఆదాయాన్ని ఇన్‌ఛార్జ్ ఇఒ జి.ప్రసాదబాబు ఆధ్వర్యాన మంగళవారం లెక్కించారు. దీని ఆదాయం రూ.2,75,074 వచ్చిందన్నారు. టిక్కెట్లు, శీఘ్రదర్శనం ద్వారా రూ.1.8 లక్షలు, శీఘ్రదర్శనం ప్రత్యేక దర్శనం ద్వారా రూ.94 వేలు, కేశఖండన ద్వారా రూ.8 వేలు, విరాళం ద్వారా 5,001, తాత్కాలిక హుండీల ఆదాయం రూ.60,073 వచ్చిందన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.74,747 తక్కువ ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పొందూరు : సంక్షేమ బోర్డును ప్రదర్శిస్తున్న నాయకులు

రాష్ట్రంలో అవినీతిరహిత పాలన

ప్రజాశక్తి- కవిటి

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అవినీతి రహితంగా సంక్షేమ పథకాల అమలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, దానికి ఆర్థిక సాయం, ప్రతి మహిళకూ ప్రత్యేక గుర్తింపు ప్రస్తుత ప్రభుత్వంలోనే సాధ్యమైందని, అందుకే మళ్లీ జగనే అధికారంలోకి రావాలని జెడ్‌పి వైస్‌చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. మండలంలోని బల్లిపుట్టుగలో జగనే ఎందుకు రావాలి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించి పంచాయతీలో అందించిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో కలియ తిరుగుతూ వైసిపి ప్రభుత్వ విధి విధానాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, పూర్తిస్థాయిలో అమలు జరిగిన మేనిఫెస్టో వివరాలు ఓటరుకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకృష్ణ దొళ్లై, ఎంపిపి మాజీ వైస్ చైర్మన్ రజనీకుమార్ దొళ్లై, ఎంపిసి వైస్ చైర్మన్ నీలయ్య, జిల్లు యుగంధర్, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: జగన్‌తోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గోవిందపురంలో సర్పంచ్ ప్రతినిధి పాలిన ఉమా మహేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జగనే ఎందుకు రావాలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరమ్మ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని అచ్చిపోలవలస వై నీడ్ ఏపీ జగన్ కార్యక్రమాన్ని వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ ఆధ్వర్యాన నిర్వహించారు. పంచాయతీలో ప్రభుత్వం అందజేసిన లబ్ధిని తెలియజేసే బోర్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, సర్పంచ్ పైడి సన్యాసిరావు, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకటకృష్ణారావు, ఎంపిటిసి సువ్వారి మోహనరావు, వైసిపి నాయకులు గురుగుబెల్లి శేఖర్, కిల్లాన సూర్యారావు పాల్గొన్నారు.

కవిటి : వైసిపి పతాకాన్ని ఆవిష్కరిస్తున్న విజయ

కోటబొమ్మాళి: మండలంలోని తర్లిపేటలో ఏపీకి జగన్ ఎందుకు రావాలి, మా నమ్మకం నువ్వే జగన్, పల్లెని కార్యక్రమాల్లో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, ఎంపిటిసి సంపాత రాజశేఖర్, వైస్ ఎంపిపి దుక్క రోజా, జెసిఎస్ కన్వీనర్ గద్దవలస నాగభూషణరావు పాల్గొన్నారు. ముందుగా వైసిపి పతాకాన్ని ఆవిష్కరించి సంక్షేమ బోర్డును ప్రదర్శించారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని రత్తకన్నలోని 18,19,20 వార్డుల్లో మళ్లీ జగనే రావాలి కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, సీడ్ ఏపి చైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు తాడి ఆరుణ్ణి, జగన్నాథయ్యలు, టౌన్ అధ్యక్షులు ప్రధానం, జెసిఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఉద్యోగోన్నతి కల్పించాలని వినతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులకు, అనుబంధ ఉద్యోగులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు కల్పించాలని సచివాలయాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ కోరారు. ఈ మేరకు స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ తప్పకుండా అందరికీ ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపడతామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌బికె అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అన్నెపు సత్యారావు, కె.కుమార్, లోలుగు సూర్యనారాయణ, కూన సురేష్, చింటు అశోక్ పాల్గొన్నారు.

టిడిపితో మత్స్యకారుల అభివృద్ధి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మత్స్యకార సామాజిక తరగతి నుంచి రాష్ట్ర మంత్రి వర్గంలో ఉన్న మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బాగుపడ్డారు తప్ప మత్స్యకార జీవితాల్లో ఎటువంటి మార్పు రాలేదని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. మండలంలోని కొత్తపేటలో నిర్వహించిన ప్రపంచ మత్స్యకార దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. మత్స్యకారులకు ఇప్పుడు అందిస్తున్న ఆయిల్ సబ్సిడీ టిడిపి ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిందన్నారు. ఎంపి కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి పాటుపడింది టిడిపి మాత్రమే నని అన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ మత్స్యకార ఓట్లతో గెలిచిన అప్పలరాజు మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సూరాడ మోహనరావు, గోవింద పాపారావు, జి.వసంతస్వామి, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న కమిషనర్ రవిసుధాకర్

పక్కాగా కులగణన

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వ ఆదేశాల మేరకు కులగణనను పక్కాగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో పురపాలక స్థాయిలో వార్డు సచివాలయ పరిపాలన, ప్రణాళిక, సంక్షేమ కార్యదర్శులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు సచివాలయ స్థాయిలో ఈనెల 23లోగా సచివాలయం సిబ్బందికి, వాలంటీర్లకు శిక్షణ ఉంటుందని అన్నారు. తదుపరి వారం రోజుల్లో కులగణన పూర్తిచేయాల్సి ఉందన్నారు. కులగణన కోసం వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించి తగు సమాచారం తెలుపడంతోపాటు సమాచార ధ్రువీకరణ నిమిత్తం కుటుంబ సభ్యులు బయోమెట్రిక్ నిర్ధారణ చేయాలని కోరారు. భవిష్యత్‌లో ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు మరింత సులభతరంగా ప్రజలు పొందాలంటే కులగణన సర్వేలో తమ సమాచారం తప్పక పొందుపరుచుకోవాలని సూచించారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

అర్హతే ప్రామాణికంగా గడపగడపకూ సంక్షేమ ఫలాలు సిఎం జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కేశవదాసుపురంలో సర్పంచ్ మొదక శంకరరావు అధ్యక్షతన మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతి, వివక్షతకు తావులేకుండా పాలనను అందిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ ఫలాలు లబ్ధిని చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన సూరపునాయుడు, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, లింగాల చిరంజీవి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురం, గంగారాజపురం, పెద్దజగన్నాధపురం, గోవిందపురం గ్రామాల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, మండల పార్టీ కన్వీనర్ పల్లి యోగి, మాధవరావు, జయమునిరావు, శంకరరావు, కరణం శశిభూషణరావు, జి.వెంకటరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలోని తొలుసూరుపల్లిలో వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కూడిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సంపతరావు రాఘవరావు, దువ్వాడ హైందవి మోహన్, సర్పంచ్ ప్రతినిధి బగాది రామకృష్ణ, ఎంపిటిసి ప్రతినిధి చింతాడ అప్పన్న, వంబరవల్లి ధర్మరాజు, బమ్మిడి అప్పన్న, బమ్మిడి చిన్నారావు, తిర్లంగి అప్పన్న పాల్గొన్నారు.

పొందూరు : పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

ఘనంగా దూరదర్శన్ డే వేడుకలు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని మాకన్నపల్లిలో తెలుగు టివి, ఫిలిం ఫెడరేషన్, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్ ఆధ్వర్యాన ప్రపంచ టివి దినోత్సవం వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా టివికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1902వ ఏడాదిలో ఆటో వాన్ బ్రాండ్ అనే జర్మనీకి చెందిన వ్యక్తి టివి కనుగొన్నాడని, 1927 నాటికి మద్రాస్‌లో బి.శివకుమారన్ అనే వ్యక్తి డిడి టెక్టర్ ట్యూబ్ అనే షార్ట్ ఫిల్మ్‌ను ప్రదర్శన చేశారని అన్నారు. 1959 నాటికి ఢిల్లీలో ఇండియా తరపున దూరదర్శన్ కేంద్రాన్ని ప్రారంభించారని తెలిపారు. యాంటిన టివి నుంచి వైర్లెస్ హెచ్‌డి టివి వరకు అభివృద్ధి చెందిందని అన్నారు. ప్రస్తుత ఆధునిక మహిళకు టివి ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ప్రజా రచయిత, గాయకుడు కుత్తుం వినోద్ మాట్లాడుతూ నిరుపేదలు సైతం టివిని తప్పనిసరిగా వాడుతున్నారని, కష్టజీవుల మానసిక ఉల్లాసానికి టివిలు ఎంతగానో ఉపయోగపడుతున్నా యని అన్నారు. కార్యక్రమంలో సినీ కొరియోగ్రాఫర్ పత్తిరి తాతారావు, గ్రామ పెద్దలు కుత్తుం ధర్మారావు, యువజన నాయకులు పోతనపల్లి వెంకటేష్, మడ్డు భరత్, మహిళా సంఘం నాయకులు బొంగు మహాలక్ష్మి, యువజన మహిళా కార్యకర్త శిరీష, యువజన సంఘం ఉపాధ్యక్షులు సైని మాధవరావు, దేశ సైనికులు తెప్పల రఘువర్మ పాల్గొన్నారు.

టివికి పూలదండ వేస్తున్న కుమార్ నాయక్

మాట్లాడుతున్న మాధవరావు

అమరుల స్ఫూర్తితో పోరు

వజ్రపుకొత్తూరు : జిల్లాలో పోరాటం అమర వీరులు అందించిన స్ఫూర్తితో పోరు సాగిద్దామని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రటిసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. మండలంలోని మర్రిపాడు అమర వీరుల స్థూపం వద్ద 45వ స్మారక సభను మంగళవారం నిర్వహించారు. ముందుగా స్మారకంపై అమరుడు మురిపింటి వల్లభరావు సతీమణి ఎరకమ్మ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకులు 360 మంది పోరాట యోధులను కాల్చి చంపిందన్నారు. మోదీ, జగన్ ప్రభుత్వాలు కులం, మతం అడ్డు పెట్టుకొని రాజ్యాధికారం చేస్తున్నారని ఆరోపించారు. దేశాన్ని ఫాసిస్టు పద్ధతిలో పాలించాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కరువు తాండవిస్తున్నా జగన్ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. ప్రజా కళాకారుడు అందాల కోటేశ్వరరావు, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, కార్యదర్శి కూర్మారావు, సవర బంగ్లాకుమార్, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి కోసంగి సోమేశ్వరరావు, ఎఐఎఫ్‌టియు నాయకుడు జుత్తు వీరాస్వామి, లిబరేషన్ జిల్లా కార్యదర్శి సన్యాసిరావు, శ్రీనివాస్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మురిపింటి తాతారావు, వంకల పాపయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

తెప్పోత్సవానికి మంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఈ నెల 24న క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకుని అరసవల్లిలో జరిగే తెప్పోత్సవానికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆలయ పాలక మండలి సభ్యులు ఆహ్వానించారు. మంగళవారం మంత్రి కార్యాలయానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. 24న సాయంత్రం 4 గంటలకు ఇంద్ర పుష్కరిణిలో ఉషా పద్మిని ఛాయా సమేతంగా స్వామి వారిని ఊరేగించనున్నామని అన్నారు. మంత్రి మాట్లాడుతూ హంస వాహన సేవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేయాలని సూచించారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పాలక మండలి సభ్యులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇఒ హరిసూర్యప్రకాష్, ట్రస్టు బోర్డు సభ్యులు మండవిల్లి రవి, లుకలాపు గోవిందరావు, దుక్క గన్ని రాజు, జలగడుగుల శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి, ద్వారపు అనురాధ, జోగి మల్లేమ్మ, వాబ యోగి, నేమలిపురి కోటేశ్వరచౌదరి, కొంచాడ సోమేశ్వరరావు, వభ లోకేశ్వరి పాల్గొన్నారు.

దుస్తులు అందజేత

నందిగాం : మండలంలోని పెద్దతామరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న వంజంగి కుమారి ఉదారతను చాటుకున్నారు. తాను పనిచేస్తున్న పాఠశాలలో చదువుతున్న వికలాంగుడు జన్ని హేమంతరావుకు మంగళవారం దుస్తులు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు కె.గున్నయ్య, సహ ఉపాధ్యాయులు ఆమె ఉదార స్వభావాన్ని కొనియాడారు.

పుస్తకాలను అందజేస్తున్న కుమారి

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

హైకోర్టు తీర్పుతో నిజం గెలిచింది

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ ఆయన సతీమణి భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమం హైకోర్టు తీర్పుతో రుజువైందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని రాపాకలో విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక నేరస్తుడైన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, చంద్రబాబునాయుడును అవినీతిపరునిగా చిత్రీకరించేందుకు చేసిన ప్రయత్నం విఫలమైందన్నారు. నాలుగున్నరేళ్లలో చంద్రబాబుపై ఒక్క అవినీతినైనా నిరూపించగలిగారా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు చంద్రబాబుపై రూ.ఆరు లక్షల కోట్ల దోపిడీ అని, పింక్ డైమండ్ అని రకరకాల ప్రచారం చేశారని, ఏదైనా నిరూపించగలిగారా అని అన్నారు. చట్టాలు, వ్యవస్థలను మేనేజ్ చేసి 53 రోజులు చంద్రబాబును జైలులో ఉంచారని, అవే వ్యవస్థలు సక్రమంగా పనిచేసే జగన్, మంత్రులతో పాటు అవినీతికి పాల్పడిన వారంతా కటకటాల వెనక్కి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహనరావు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, నాయకులు కె.సన్యాసిరావు, కె.అప్పలనాయుడు, పి.పారంనాయుడు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎపిఎం కూర్మారావు

మినీ బ్యాంకింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయంశక్తి సంఘాలు గ్రామాల్లో మినీ బ్యాంకులుగా వ్యవహరిస్తున్న విధానాన్ని, అవలంబించాల్సిన పద్ధతులను తు.చ. తప్పకుండా పాటించాలని వైఎస్‌ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య ప్రాంగణంలో సిబ్బందికి మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి సంఘం పంచ సూత్రాలు పాటిస్తూ, సభ్యుల నుంచి డిపాజిట్‌గా సేకరించిన పొదుపు మొత్తాలను బ్యాంకు సేవింగ్ ఖాతాలో నుంచి సంఘ సభ్యులందరి ఆమోదంతో తమ సభ్యులకు అవసరం మేరకు నేరుగా సభ్యులు ఖాతాకు అప్పులు మంజూరు చేసుకోవచ్చని తెలిపారు. మండల పరిధిలో ఇప్పటివరకు పొదుపు ఖాతాల నుంచి అప్పులుగా మంజూరు చేసిన సుమారు నాలుగు కోట్ల రూపాయలకు సంబంధించిన రీపేమెంట్ విధానాన్ని, అనుసరిస్తున్న పుస్తక నిర్వహణను, పరిశీలించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులు ధనలక్ష్మి, రేణుక, ఉషారాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, మండల సమైక్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

పుస్తకం మంచి నేస్తం

ప్రజాశక్తి- బూర్జ

పుస్తకం మంచి నేస్తమని ఓ.వి.పేట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు అన్నారు. ఆదర్శ పాఠశాలలో లైబ్రరీ వారోత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం వివిధ పుస్తకాల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తక విజ్ఞానంతో పాటు ప్రపంచాన్ని, అందులోని సారాంశాన్ని తెలుసుకోవచ్చునని అన్నారు. లైబ్రరీ టీచర్ కె.వెంకటరత్నం విద్యార్థులకు పుస్తక పఠనంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో చింతాడ కృష్ణారావు, ఉపాధ్యాయులు టి.శివప్రసాద్, ఆర్.భవాని పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రాష్ట్రస్థాయి అండర్-14 స్కూల్ గేమ్స్ బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలకు గోవిందపురం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి బి.జస్వంత్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్.నాగరాజు తెలిపారు. మంగళవారం విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు కె.హరిబాబు, ఉపాధ్యాయులు లక్ష్మణరావు, చింత ఉమారావు, అలీ బెగ్, సత్యరాజ్ అభినందించారు. ఈ నెల 23 నుంచి 25 వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఆటలు పోటీలు జరుగుతాయని తెలిపారు. 200 మీటర్ల పరుగు పందెంలో జస్వంత్ పాల్గొంటారని అన్నారు.

యువతి అదృశ్యం

టెక్కలి రూరల్: టెక్కలి అక్కపువీధికి చెందిన కోళ్ల జ్యోత్స్న అదృశ్యంపై మంగళవారం టెక్కలి పోలీస్ స్టేషన్‌లో యువతి తండ్రి హేమాచల్ దేవ ఫిర్యాదు చేశారు. ఈనెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదని, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా కనిపించలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. టెక్కలి ఎస్ఐ-2 కె.రమేష్ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిత్లీ పరిహారం పంపిణీపై ఆడిట్

ప్రజాశక్తి- కవిటి

2018లో సంభవించిన తిత్లీ తుపాకు నష్టపోయిన రైతులకు అందించిన పరిహారం పంపిణీపై స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మంగళవారం ఆడిట్ నిర్వహించారు. సీనియర్ ఆడిటర్ టి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఆడిటర్ గంగరాజులు సంబంధిత రికార్డులు పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ జిల్లాలో తిత్లీ పరిహారం కింద పంపిణీ చేసిన రూ.182.6 కోట్లపై ఆడిట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఆడిట్‌లో తహశీల్దార్ పి.శేఖర్, డిటి రామచంద్రరావు, ఆర్ఐ రమణమూర్తి, ఉద్యానశాఖ అధికారి పి.మాధవీలత, విఆర్ఒలు దివాకర్, సంతోష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆడిట్ అధికారులు

అవగాహన కల్పిస్తున్న కృష్ణ

కొబ్బరిలో ఎటిఎం మోడల్

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రావాడ పంచాయతీ ఉప్పివలసలో పప్పల చిరంజీవి అనే రైతు 0.20 సెంట్లు కొబ్బరి తోటలో కూరగాయలు పంటలతో ఎటిఎం మోడల్ వేయించామని ప్రకృతి వ్యవసాయ డిఎంఎంటి జి.రాంబాబు, మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఎటిఎం మోడల్‌లో ఒక బెడ్ వెడల్పు 4 అడుగులు మధ్యలో ఒక అడుగు కాలువ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ విధంగా ఏర్పాటు చేసుకున్న బెడ్డపై దుంప జాతులు ముల్లంగి, క్యారెట్, బీట్రూట్, కాయగూరలైన వంగ, టమోటా, బెండ, చిక్కుడు, మిరప, ఆకుకూరలు తోటకూర, గోంగూర, జొన్న, సజ్జ తదితర పంటలను నిర్ణీత కొలతల ప్రకారం వేసుకోవాలన్నారు. దీంతో 365 రోజులూ ప్రకృతి ప్రకతి వ్యవసాయ పద్ధతుల కూరగాయాలు దిగుబడిని పొందవచ్చునని తెలిపారు. పౌష్టిక ఆహారంతో పాటు మంచి నేలలు కూడా తయారై చీడపీడల యాజమాన్యం సులువుగా చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ విధంగా మోడల్స్ వేయడం వల్ల తక్కువ ప్రదేశంలో ఎక్కువ ఆదాయం, ఎక్కువ రకాల పంటలు పండించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డిస్ ఫౌండేషన్ మేనేజర్ హరిబాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డిఎంఎంటి పి.సత్యన్నారాయణ, యేసుబాబు, శివ శంకర్, సూర్యం, రమణమ్మ, సుజాత, జనార్ధనరావు, జయమ్మ పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

లావేరు: మండలంలోని కొత్తకుంకం పంచాయతీలోని లక్ష్మీనారాయణపురంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతు పిడుగు గోపాల్ పొలంలో సాగుచేసిన వరి ఎంటియు 1121 రకం పంటను సిబ్బంది మంగళవారం పంటకోత ప్రయోగం చేశారు. ఎకరానికి 34 బస్తాలు దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాంబాబు అప్పారావు, సోమశేఖర్లు తెలిపారు. రైతు గోపాల్ మాట్లాడుతూ మంచి దిగుబడి వస్తాయని చెప్పడం ఆనందంగా ఉందన్నారు. ఎటువంటి రసాయన ఎరువులు వాడలేదని తెలిపారు.

ఆమదాలవలస : మండలంలోని పర్వతాలపేటలో మండల వ్యవసాయ శాఖ అధికారులు నరసింహులు అనే రైతు పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. పంట కోత ప్రయోగ పర్యవేక్షణ అధికారిగా కేంద్ర ప్రభుత్వ అధికారి కె.వి.సురేష్ కుమార్ పాల్గొన్నారు. 5ఇంటు5 విస్తీర్ణంలో వరి పంట కోత కోసి పరిశీలించారు. 15 కేజీల 450 గ్రాముల ధాన్యం దిగుబడి వచ్చినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. కార్యక్రమంలో ఎఇఒ టి.రాము, ఎఎస్ఒ పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

లావేరు : పంటకోత ప్రయోగం చేస్తున్న సిబ్బంది

రోబోటిక్స్‌పై సెమినార్

శ్రీకాకుళం: ప్రభుత్వ పురుషుల కళాశాల, భౌతిశాస్త్ర విభాగంలో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ అనే అంశంపై ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ నేమాన వెంకట సత్యనారాయణ మంగళవారం ఎక్స్ప్లోరింగ్ రోబోటిక్స్, కోడింగ్‌పై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు ఫండమెంటల్స్ అఫ్ కోడింగ్ అండ్ డి కోడింగ్ అంశంపై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభిస్తామని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, ఎం.వి.సత్యనారాయణ, జైపాల్‌రావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

పలువురికి ఆర్థికసాయం

మెళియాపుట్టి : మండలంలోని పట్టుపురంలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి టిడిపి నాయకులు, సామాజిక కార్యకర్త మామిడి గోవిందరావు కమిటీ సభ్యులకు మంగళవారం రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆపదలో ఉన్న వారు తనను సంప్రదిస్తే సహాయ సహకారాలు అందజేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, లాభాల వెంకటేష్, పైల కూర్మారావు, బమ్మిడి దామోదర్, పి.కామేశ్వరరావు, పి.దామోదర్, మండల వాసుదేవరావు, గోక మోహనరావు, తాడేల షణ్ముఖరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని భావనపాడుకు చెందిన లింగూడు. స్వతంత్రరావుకు కోమరల్తాడకు చెందిన ఉద్దానం అభ్యుదయ సేవా సమితి సభ్యులు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. 30 ఏళ్ల స్వతంత్రరావుకు పూర్తిగా రెండు కళ్లు కనిపించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్న విషయాన్ని తెలుసుకున్నారు. ఉద్దానం అభ్యుదయ సేవాసమితి రూ.7 వేలు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు తామాడ లక్ష్మణరావు, మండల మహేష్, కొంకి మోహిని, రజిని, ఉమా పాల్గొన్నారు.

బాలికా సంరక్షణకు సమన్వయంతో పనిచేయాలి

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న లావణ్య

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బాలికా సంరక్షణకు అధికారులు, పాలకులు కలిసికట్టుగా పనిచేయాలని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపెల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ అధ్యక్షతన బాలికా సంరక్షణ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడ పిల్లల అభివృద్ధికి ప్రభుత్వం చట్టపరంగా ఎన్నో అవకాశాలు కలిపిస్తుందని అన్నారు. తల్లితండ్రులు తమ బాధ్యత తీరిపోతుందని దృక్పథంతో ఆడపిల్లలకు చిన్న వయసులో వివాహం చేస్తున్నారని, ఇది చాలా పెద్ద నేరమని, దీనిని ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు ధనలక్ష్మి, లత, గంగమ్మ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : కొత్తగా ఏర్పాటు చేస్తున్న కమిటీ సహకారంతో భవిష్యత్‌లో బాల్యవివాహాలు జరగకుండా చూడాలని ఐసిడిఎస్ ఎసిడి పిఒ లావణ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పురుషోత్తంపురం సచివాలయం పరిధిలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్ చైర్మన్‌గా, కన్వీనర్‌గా మహిళా పోలీస్ సూర్యకుమారి వ్యవహరిస్తారని అన్నారు. వార్డు కౌన్సిలర్ పుష్ప, సాలీనా బాలాజీ, సూపర్‌వైజార్ సుజాత, విఆర్ఒ చూడామణి, అడ్మిన్ దయాకర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. బాలల సంక్షేమ సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి

పొందూరు: గ్రామస్థాయిలో బాలల సంక్షేమ, సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని ఐసిడిఎస్ సిడిపిఒ ఎస్.గీత అన్నారు. పొందూరు ఐసిడిఎస్ కార్యాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలకు బాలల సంరక్షణ విభాగం సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఆవరణంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగం లీగల్ కం ప్రొటెక్షన్ ఆఫీసర్ టి.లక్ష్మణరావు, సోషల్ వర్కర్ జనార్ధన, సింగూరు శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు అన్నమ్మ, రమాదేవి, కృష్ణవేణి, బ్లాక్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ టి.నీరజాక్షి పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి

బూర్జ : రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని బిసిసెల్ మండల అధ్యక్షులు మామిడి దుర్గారావు అన్నారు. మండలంలోని పెద్దలంకాంలో బాబు షూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టిడిపి మేనిఫెస్టోను ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. నిత్యవసర వస్తువులతో పాటు అన్ని రకాలు వస్తువులు ధరల ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో దాసిరెడ్డి వెంకినాయుడు, కృష్ణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, బిసి కళింగకోమటి సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ బోయిన గోవిందరాజులు అన్నారు. కోటబొమ్మాళి పంచాయతీ సీతన్నపేటలో మండల పరిషత్ మాజీ కో-ఆప్షన్ మెంబరు మెగిలిపురి హరిహరరాజు ఆధ్వర్యాన బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కోరాడ గోవిందరావు, మాజీ సర్పంచ్ దేవాది సింహాద్రమ్మ పాల్గొన్నారు.

శ్రీకాకుళం : నగర కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నగర తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ఎపి రైతు సంఘ ప్రధాన కార్యదర్శి చింతు సుధాకర్, జిల్లా టిడిపి మీడియా కో-ఆర్డినేటర్ జామి భీమశంకర, డివిజన్ ఇన్‌ఛార్జి కావ్వడ సుశీల, నల్లన మధు, వరుణ్ పాల్గొన్నారు.

పోస్టర్లను అందజేస్తున్న నాయకులు

ఆమదాలవలస : మండలంలోని శ్రీనివాసచార్యులపేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి ఆధ్వర్యాన బాబు షూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి మల్లేశ్వరరావు, గురుమూర్తి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

పొందూరు: గ్రామీణ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబనను సాధించాలని ఉషా ఇంటర్నేషనల్ స్టేట్ కో-ఆర్డినేటర్, బెజ్జిపురం యూత్‌క్లబ్ అధ్యక్షులు టి.రాజ్‌కుమార్, ఎం.ప్రసాదరావులు పేర్కొన్నారు. పొందూరు పట్టణంలో సిడిబి బ్యాంకు ఆర్థిక సహకారంతో ఉషా కంపెనీ, వాసవ్య మహిళా మండలి, బెజ్జిపురం యూత్‌క్లబ్ సంయుక్త సహకారంతో స్వయంశక్తి సంఘాల మహిళలకు కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పొందూరు, ఎచ్చెర్ల మండలాలకు చెందిన సుమారు 25 మంది మహిళలకు తొమ్మిది రోజులు పాటు కుట్టు శిక్షణను అందించనున్నారు. కార్యక్రమంలో విజయవాడ వాసవ్య మహిళా మండలి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూన శివయ్య, వైకెపి ఎపిఎం గురుగుబెల్లి శ్యామలరావు, మాస్టర్ ట్రైనర్ ఎం.భాను, వైసిబి సిఇఒ నున్నా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిఎంజెజెబివై చెక్కు అందజేత

పోలాకి : పోలాకి కేంద్రంలో డోల కాళిదాసు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. నామినీ అయిన ఆయన భార్య పుణ్యవతికి పిఎంజెజెబివై ఇన్సూరెన్స్ వర్తించడంతో రూ.2 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ కోటేశ్వరరావు గ్రామ పెద్దల సమక్షంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చనిపోయిన వ్యక్తి పేరు మీద గ్రామీణ వికాస్ బ్యాంకులో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం నమోదు చేసుకున్నారని అన్నారు. ప్రతిఒక్కరూ ఇన్సూరెన్స్‌లో నమోదు కావాలని సూచించారు. సర్పంచ్ మజ్జి రమణమ్మ, అశోక్‌కుమార్, ఆర్.త్రినాథరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

షాపుల తనిఖీ

ప్రజాశక్తి- కవిటి

బాల్యం బడిలో సాగాలి కానీ, బాలకార్మిక వ్యవస్థలో కాదని ఎస్ఐ కె.రాము, ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛా-4లో భాగంగా చైల్డ్ లైన్ సిబ్బంది, న్యాయశాఖ సిబ్బంది కవిటిలో పలు షాపులు, ఐస్ ఫేక్టరీలు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ అనేది చట్టరీత్యా నేరమని, అటువంటి సంఘటనలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బడుగు బలహీన వర్గాల పిల్లల కోసం ప్రభుత్వం నాణ్యమైన విద్య అందిస్తోందని అన్నారు. దాన్ని అందిపుచ్చుకుని బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్, దిశ, జుడిషియల్ సిబ్బంది పాల్గొన్నారు.